క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి



రైతులకు తైవాన్ స్ప్రేయర్లు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

కొనకనమిట్ల: ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలతో పాటు నీటి యాజమాన్య సంస్థ అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని.. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. శనివారం గార్లదిన్నెలోని 58 రైతులకు నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ పనిముట్లు అందజేశారు. మాజీ సర్పంచ్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, వాటర్‌షెడ్ అధికారి సుధాకర్, ఎల్‌బీసీ వెంకటరెడ్డి, సింగారెడ్డి సుబ్బారెడ్డి, టెక్నికల్ అధికారులు రాజు, ఆనంద్, ఆగ్రోస్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అవసరం



మార్కాపురంలో అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

మార్కాపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు, ప్రజలు సహకరించాలని ట్రైనీ ఎస్పీ అంకితా సురానా కోరారు. శనివారం పట్టణ శివార్లలో ఆమె వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి ప్రయాణిస్తూ, హెల్మెట్ లేకుండా వేగంగా వస్తున్న వాహనదారులను, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటో డ్రైవర్లను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మహిళా కార్మికులకు కిట్లు అందజేత

ఒంగోలు అర్బన్: రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు వర్మ క్యాటరింగ్‌లో పనిచేసే 40 మంది మహిళా కార్మికులకు రెడ్‌క్రాస్ ద్వారా శనివారం హైజీన్ కిట్లు అందజేశారు. మేనేజింగ్ కమిటీ, బ్లడ్ బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహారావు చేతుల మీదుగా ఒక్కో కిట్ రూ.500 విలువ చేసే వాటిని కార్మికులకు ఉచితంగా పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ కన్వీనర్ శ్రీనివాసరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

12 మంది పేస్ విద్యార్థులకు బహుమతులు

ఒంగోలు: స్థానిక పేస్ కాలేజీలో ఇటీవల జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్ క్యాంపులో 12 మంది పేస్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ విద్యార్థులను అభినందించారు. ఫైరింగ్, అబ్‌స్టకిల్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజీన్, నృత్య ప్రదర్శనలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, స్టూడెంట్ డీన్ అఫైర్స్ జి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే

చీమకుర్తి: వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. దానికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం సంతనూతలపాడులో ఆవిష్కరించారు. తల్లిదండ్రుల పోషణ సంక్షేమ చట్టం 2007, హెల్ప్‌లైన్ 14567కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన అనంతరం చెంచిరెడ్డి మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం వయో వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ నిమిత్తం ప్రతి నెలా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పిల్లలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దానికి సంబంధించి తల్లిదండ్రులు, పిల్లలకు ఆర్డీవో వద్ద కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి వయోవృద్ధులైన తల్లిదండ్రులకు భరోసా ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పీ జాన్‌బాబు, కిరణ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీబీని తరిమికొట్టేందుకు సహకరించాలి

కొత్తపట్నం: టీబీ రహిత గ్రామాలను తీర్చిదిద్దడానికి గ్రామస్తులు, సర్పంచ్‌లు సహకరించాలని ఈతముక్కల, కొత్తపట్నం పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శివపార్వతి, డాక్టర్ వైష్ణవి కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో టీబీపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. సీహెచ్‌వో ఓంకార్, ఈవోఆర్డీ ఏ బాల చెన్నయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన అవసరం

ఒంగోలు రూరల్: కుష్టువ్యాధిపై అవగాహన అవసరమని డాక్టర్ సుందర్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని కరవది పీహెచ్‌సీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం మండలంలోని అన్ని గ్రామాల ఆశాలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెచ్‌వీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వారికి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పక్కాగా డ్వాక్రా లెక్క

- డ్వాక్రా లావాదేవీల్లో మరింత పారదర్శకత
- అందుబాటులోకి లోకోస్ యాప్
- జిల్లా వ్యాప్తంగా లోకోస్‌పై శిక్షణ



శిక్షణ పొందుతున్న డ్వాక్రా మహిళలు

బేస్తవారిపేట: డ్వాక్రా మహిళల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వివిధ పథకాల ద్వారా కృషి చేస్తున్నారు. సంఘాల బలోపేతంతో పాటు సభ్యులు స్వయం ఉపాధిలో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పాటునందిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, జీరో వడ్డీ, బ్యాంకు రుణాలు, పొదుపు వివరాల్లో మరింత పారదర్శకత పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ యాప్ ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న పొదుపు సంఘాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేలా రూపకల్పన చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం(వైకేపీ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన పెంచేలా కార్యాచరణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 44,940 డ్వాక్రా సంఘాల్లో 4,52,541 మంది అక్కచెల్లెమ్మలు సభ్యులుగా ఉన్నారు.

> **యాప్‌లో కీలక సమాచారం:**
>
> 
>
> లోకోస్ యాప్‌పై వైకేపీ సిబ్బంది క్షేత్రస్థాయిలో డ్వాక్రా సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించాం. డ్వాక్రా సభ్యులు తీసుకున్న రుణం, జరిపిన లావాదేవీల్లాంటి కీలక సమాచారం యాప్‌లో తెలుసుకోవచ్చు. అవకతవకలకు ఏ మాత్రం తావుండదు. సభ్యుల చేరికలు, తొలగింపు సైతం గ్రామ స్థాయిలోనే చేసుకోవచ్చు.
>
> బాబూరావు, డీఆర్‌డీఏ పీడీ, ప్రకాశం

క్షేత్రస్థాయిలో అవగాహన

వైకేపీ ఆధ్వర్యంలో మొబైల్ బుక్ కీపింగ్, డ్వాక్రా సభ్యుల వేలిముద్రలు, సంఘాల పనితీరు, ఇతర వివరాలను ఇప్పటికే అందుబాటులోనున్న యాప్‌ల ద్వారా నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. దీనికి భిన్నంగా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి లెక్కలన్నీ పక్కాగా మార్చేలా కృషి చేస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో సభ్యులకు అవగాహన కల్పించేందుకు మండలాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి యాప్‌లో వివరాలు నమోదు చేయించే కార్యక్రమం వేగవంతం చేశారు.

జిల్లాలో డ్వాక్రా సంఘాల వివరాలు	
డ్వాక్రా సంఘాల సంఖ్య	44,940
సభ్యుల సంఖ్య	4,52,541
వీఓలు	1554
మండల సమాఖ్యలు	38

లావాదేవీల్లో పాదర్శకత

డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో జరిపే ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెరిగేలా లోకోస్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పొదుపు సంఘాల్లో సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న వాయిదాల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. పొదుపు సంఘాల బాధ్యతలను ఆ పరిధిలోనున్న వీఓలు పర్యవేక్షిస్తుంటారు. వీరు కూడా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండటంతో పారదర్శకత లోపిస్తోందని భావించి పక్కా వివరాల కోసం లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారని వైకేపీ అధికారులు చెబుతున్నారు.

జగనన్న సురక్ష విజయవంతానికి కృషి

- ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష
- ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. కంభం సచివాలయం పరిధిలో శనివారం ఎమ్మెల్యే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. వలంటీర్లు ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రజల చెబుతున్న సమస్యలు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు చూడటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారులకు 90 శాతానికి పైగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, అర్హత ఉండి ఇంకా ఎవరైన సంక్షేమ ఫలాలు పొందలేని వారు ఉంటే వారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. సాదు మీయా వీధి ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ స్వాతి, సర్పంచ్‌లు పల్నాటి బోడయ్య, మహబూబ్ పీరా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, డిష్ మున్నా, ఎంపీటీసీలు ఆనంద్, నాగరాజు, రఫి, కొత్తపల్లి శ్రీను, కృష్ణ, ఆరీఫ్, మున్నా, కరీంబాషా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని జిల్లా పంచాయతి అధికారి జీవీ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లూరు, శివరామపురాల్లో శనివారం వలంటీర్లు ఇంటింటికీ తిరిగి చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. డీపీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందే విధంగా సేవలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం నివాసం వద్దకే సేవలు అందించేందుకు జగనన్న సురక్ష పథకం తీసుకొస్తుందని చెప్పారు. క్యాంపుకు తప్పనిసరిగా ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాళ్లూరు సర్పంచి మేకల చార్లేస్ సర్జన్, ఈఓఆర్డీ కేజీఎస్ రాజు, కార్యదర్శి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: జగనన్న సురక్ష పథకంలో భాగంగా మండలంలోని అంబవరంలో తహసీల్దార్ కె.విజయకుమారి ఆధ్వర్యంలో, గడికోటలో ఎంపీడీఓ హేమలత ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ఇంటింటా సర్వే చేసింది. తహసీల్దార్ విజయకుమారి మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి

జగనన్న సురక్ష సమగ్రంగా చేయాలి

మార్కాపురం: జగనన్న సురక్ష పథకంలో ఇంటింటి సర్వే సమగ్రంగా చేయాలని మార్కాపురం మండల ప్రత్యేక అధికారి సెరీకల్చర్ ఏడీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం బోడపాడులో జరుగుతున్న సర్వే పరిశీలించారు. ఈనెల 24 నుంచి 30 వరకు ప్రతి ఇంటికీ వెళ్లి వారి వివరాలను తెలుసుకుని ఫొటోలతో సహా యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈఓఆర్డీ మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది ఆబీద్ హుస్సేన్, గోపి, విష్ణుప్రియ, అనూషారెడ్డి పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న డీపీఓ నారాయణరెడ్డి

ముండ్లమూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల ప్రభుత్వ పథకాలను అర్హతగల వారందరికీ చేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని ఎంపీడీఓ కె. కుసుమకుమారి అన్నారు. మండలంలోని పులిపాడులో జగనన్న సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చేరాల్సిన పథకాలు, వాటి ప్రాధాన్యంపై ఇంటింటినీ సందర్శించాలన్నారు. అర్హత ఉండి పథకాలు చేరకుంటే అలాంటి వారిని గుర్తించి వారికి అందేలా చూడాలన్నారు. ఈఓఆర్డీ రాజశేఖరరెడ్డి, కార్యదర్శి రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

ఆర్బీకేలు దేశానికే ఆదర్శం



పొదిలిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: విత్తనం విత్తే నాటి నుంచి పంట అమ్మకం వరకు రైతుల ఇంటి ముంగిటకే సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శమని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం పొదిలి-3 వ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతులకు (కంది,కొర్ర,వరి) చిరు సంచుల ఉచిత పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అవసరమైన సేవలన్నీ ఆర్బీకేల ద్వారా ఒకే చోట అమలు చేస్తున్నారన్నారు. ఆర్బీకేలా పరిధిలో కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద ఇస్తున్న వస్తువులను రైతులంతా అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవాలని తెలియజేశారు. గత ఏడాది క్రాప్ ఇన్సూరెన్స్ కింద పొదిలి మండలానికి అత్యధికంగా రూ. 39 కోట్లు రైతులకు అందినట్లు చెప్పారు. అనంతరం రైతులకు ఉచితంగా కందులు, కొర్రలు, వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఏడీఏ కె. బాలాజీ నాయక్, ఏఓ ఎస్.కె జైన్‌లాబ్దిన్, వైఎస్సార్ సీపీ రాష్ట్రర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కె. నరసింహారావు, నియోజకవర్గ వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె. సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు చెంచిరెడ్డి, మూదాలవారి పాలెం సొసైటీ అధ్యక్షుడు కొత్తపులి బ్రహ్మారెడ్డి, నిర్మమహేశ్వర దేవస్థానం చైర్మన్ యక్కలి శేషగిరి రావు, పులిగోర్ల శ్రీనివాసరావు, వినోద్, జాకీర్ పాల్గొన్నారు.

నేడు యోగాపై శిక్షణ తరగతులు

తాళ్లూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా విద్యానికేతన్ యోగా కేంద్రంలో ఆదివారం సాయంత్రం యోగా శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. యోగా నిపుణుడు శ్రీరామ్ గురూజీ పాల్గొని శిక్షన ఇస్తారని తెలిపారు. తాళ్లూరు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉపయోగించుకోవాలని కోరారు.

ముగిసిన సువార్త కూటాలు

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లి లూథరన్ చర్చిలో రెండు రోజుల పాటు నిర్వహించిన సువార్త ఉజ్జీవ కూటములు శనివారం ముగిశాయి. పాస్టర్ మధు ఆధ్వర్యంలో దేవుని వాక్యం చదివి వినిపించారు. యువత క్రీస్తు మార్గంలో నడవాలని ఆయన కోరారు. హైదరాబాద్‌కు చెందిన నిరంజన్, బిట్రగుంటకు చెందిన బిజయ్యలు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక సందేశం వినిపించారు. సర్పంచ్ జాన్‌రత్నం, కమిటీ సభ్యులు రత్తయ్య, చిన్నపోలు, దారా యేసులు, శేఖర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కోటేశ్వరరావు



నియామకపత్రం అందుకుంటున్న కోటేశ్వరరావు

పుల్లలచెరువు: మార్కాపురం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మండలంలోని కవలకుంట్లకు చెందిన కోటేశ్వరరావును నియమిస్తూ సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఉత్తర్వులు జారీ చేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నియమాలు పాటిస్తూ తనకు ఈ పదవి వచ్చేందుకు కారణమైన రాష్ట్ర పురపాల కశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ముండ్లమూరు: మండలంలోని నూజిళ్లపల్లి, శింగనపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న పలువురు ఉపాధ్యాయులకు శనివారం ఎంఈఓ చంద్ర మోహన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధత, చిత్తశుద్ధితో పని చేస్తే ప్రజల మన్ననలు పొందొచ్చన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రంగస్వామి, శ్రీనివాసరావు, మావో, సంధ్యరాణి, నాగేంద్రం, తాడికొండ శ్రీనివాసరావులను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ-2 వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు లేవి ప్రసాద్, గోగుల కోటేశ్వరరావు, బేతపూడి లింగారావు, బోడపాటి శివలక్ష్మణరావు, నేతాజీ పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా
జగనన్న ప్రభుత్వం



వృద్ధురాలికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: సంక్షేమానికి చిరునామ జగనన్న ప్రభుత్వమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం రాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. 75 ఏళ్లలో రాష్ట్రంలో జరగని అభివృద్ధి గడిచిన 4 ఏళ్లలో జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఒక్కరూ బాగుండాలనే లక్ష్యంతో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సర్పంచ్ వెన్నా మహేశ్వరి సుబ్బారెడ్డి, ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ జి. శ్రీనివాసరెడ్డి, నాయకులు జవ్వాజి రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, జేఏఎస్ కన్వీనర్ బి.శ్రీనివాసరెడ్డి, బోడపాడు సర్పంచ్ రమణారెడ్డి, కొలగట్ల శివారెడ్డి, ఎల్లకర రంగయ్య, ఎంపీడీవో నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



విద్యుత్ స్తంభాలు మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలోని తోకపల్లె-కడప హైవే నుంచి ఎంపీడీఓ కార్యాలయం మీదుగా ఒంగోలు-నంద్యాల హైవే వరకు రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆరు నెలలుగా రోడ్డు విస్తరణ, నూతన రోడ్డు నిర్మాణం కోసం రోడ్డు ఆక్రమణలు తొలగించారు. గృహాల ముందు కాంపౌండ్, మెట్లు తొలగించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో గ్రాంట్ కేటాయించడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీల ఏర్పాటు, సీసీ రోడ్డు విస్తరణకు సంబంధించిన చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నో యాక్సిడెంట్ డే బోర్డుల ఏర్పాటు



ఏర్పాటు చేసిన బోర్డు వద్ద ఎస్‌ఐ

దర్శి: ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాల మేరకు నో యాక్సిడెంట్ డేలో భాగంగా బార్ అండ్ రెస్టారెంట్‌ల వద్ద నోయాక్సిడెంట్ డే బోర్డులు ఎస్‌ఐ రామకృష్ణ శనివారం ఏర్పాటు చేశారు. ఒక్క క్షణం ఆలోచించండి.. అనే హెడ్డింగ్‌తో మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగే నష్టాలను ఫ్లెక్సీలో కనబరుస్తూ ముద్రించారు. ఫ్లెక్సీలు చూసైనా డ్రైవింగ్ చేసేటప్పుడు తమ కుటుంబాలను గుర్తుతెచ్చుకుని జాగ్రత్తగా నడపాలని కోరారు.

టీబీ ముక్త భారత్‌పై అవగాహన



తర్లుపాడు: మాట్లాడుతున్న డాక్టర్ సింధూజ

తర్లుపాడు: టీబీ సమూలంగా నిర్మూలించాలని మార్కాపురం యూనిట్ క్షయ నివారణాధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కల్పించారు. 2025 నాటికి టీబీ ముక్తభారత్ కార్యక్రమం విజయవంతం చేద్దామన్నారు. తర్లుపాడు డాక్టర్ సింధూజ, ఎంపీడీవో నరసింహులు, ఇఓఆర్డీ అమరేశ్వరరావు, సూపర్‌వైజర్ గోవిందరాజు, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండువగా శాంతి కల్యాణం



ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షులు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

94 టన్నుల ఇసుక స్వాధీనం



ఇసుక డంప్ వద్ద ఎస్ఈబీ అధికారులు

ముండ్లమూరు: మండలంలోని శింగనపాలెంలో అక్రమంగా నిల్వ ఉంచిన 94 టన్నుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్‌ఐ శ్రీధర్‌బాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం శింగనపాలెం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో కందిమళ్ల వెంకటేశ్వర్లు నిల్వ చేసిన 94 టన్నుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకొని ముండ్లమూరు పోలీసులకు వివరాలు అందజేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.